సాక్షి
కర్నూలు
మంగళవారం ၊ 9 ၊ ఏప్రిల్ ၊ 2024



సాయుధ బలగాల కవాతు

కర్నూలు: స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు ఎస్పీ కృష్ణకాంత్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వర్క్‌స్టేషన్ల విరాళం

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రికి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వారు మూడు వర్క్‌స్టేషన్లను విరాళంగా ఇచ్చారు. వీటి విలువ రూ.25.5 లక్షలు ఉంటుందని సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి తెలిపారు.



.. లావాదేవీలపై నిఘా

అనుమానాస్పద, లక్షకుపైగా జరిగిన లావాదేవీలపై నిఘా ఉంచి, వివరాలను తనకు ప్రతి రోజూ నివేదించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. సృజన బ్యాంకర్లను ఆదేశించారు. 2లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:40
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:43
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:37
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:38
బనగానపల్లె	సా॥ 6:37	ఉ॥ 4:38

హదీస్ వెలుగు :

పవిత్ర రంజాన్ మాసం నేర్పిన ఆధ్యాత్మికత, ఓర్పు, సహనం, దానధర్మాలు, ఆకలి దప్పికల నియంత్రణ పాఠాల స్ఫూర్తిని ఇతర నెలల్లోనూ కొనసాగించండి. – పవిత్ర ఖురాన్

ఈ చిత్రంలో ఉన్నది ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన అప్ల లక్ష్మి కుటుంబ సభ్యులు. గతంలో కుటుంబ సభ్యులు కూలి పనులకు పోతే తప్ప పూట గడవని పరిస్థితి ఉండేది. ఇంటికి పెద్ద దిక్కు అయిన భర్త అనారోగ్యంతో మృతిచెండంతో అత్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలను ఎలా పోషించాలనే దీన స్థితిలో లక్ష్మి ఉండేది. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ కుటుంబానికి ఏమీ చేయలేకపోయింది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఈ కుటుంబ సభ్యులందరికీ లబ్ధి చేకూరింది. ఈ

కుటుంబ సభ్యులందరికీ లబ్ధి

కుటుంబానికి ఎనిమిది సంక్షేమ పథకాలు వచ్చాయి. పెట్టుబడి సాయం కింద రూ. 1.50 లక్షలు, అమ్మఒడి కింద రూ.65 వేలు, జగనన్న చేయూత కింద రూ.93,750, వితంతు పింఛన్ కింద రూ.1.50 లక్షలు, వృద్ధాప్య పింఛన్ కింద రూ.1.50 లక్షలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.20 వేలు, విద్యాదీవెన కింద రూ.90 వేలు అందాయి. ప్రభుత్వ పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకుని, ఇల్లు కట్టుకొని ఈ కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవనం సాగిస్తున్నారు. – ఆదోని రూరల్



పేదల సొంతింటి కల సాకారం!

జిల్లాకు మొత్తం 40,815 గృహాలు మంజూరు కాగా.. 303 జగనన్న లేఅవుట్లలో 21,477, సొంత స్థలాల్లో 19,338 గృహాలను నిర్మించుకుంటున్నారు. ఈ నిర్మాణాలకు సంబంధించి ఇప్పటి వరకు ముడి సరుకుతో (సిమెంట్, స్టీల్, ఇసుక తదితరాలు) కలిపి రూ.448.31 కోట్లు వెచ్చించారు. ఆదోని, కర్నూలు డివిజన్లలో రూ.4.75 కోట్లతో అప్రోచ్ రోడ్లు, ఓటీఎస్, నాన్ ఓటీఎస్ కింద రూ.1.72 కోట్లతో అప్రోచ్ రోడ్ల పనులను పూర్తి చేశారు. అలాగే ఆయా కాలనీల్లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు నీటి కోసం ఇబ్బంది పడరాదని రూ.20.10 కోట్లను ఖర్చు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు.

న్యూస్‌రీల్

తుపాకులు ఇవ్వాల్సిందే!

- లైసెన్స్‌దారులకు పోలీసుల ఆదేశం

కర్నూలు: ఎన్నికలు వచ్చాయంటే లైసెన్స్ కలిగిన ప్రతి ఆయుధం పోలీసు శాఖకు అప్పగించాలన్నది నిబంధన. బ్యాంకుల భద్రత కోసం ముందస్తు అనుమతితో సెక్యూరిటీ సిబ్బంది మినహాయించి.. మిగిలిన వారంతా ఆయా స్టేషన్ల పరిధిలో వాటిని అప్పగించాల్సిందే. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం వాటిని తిరిగి అప్పగిస్తారు. లేదంటే వాటి లైసెన్స్ రద్దు చేసే అధికారం, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం పోలీసు శాఖకు ఉంటుంది. ఎన్నికల నియమావళి అమలులోకి రాగానే శాంతి భద్రతల దృష్ట్యా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా ఆయుధాలు స్వాధీనం చేసుకుంటారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,786 మందికి పైగా ఆయుధాల లైసెన్స్‌దారులు ఉన్నారు. ఇందులో వ్యాపార సంస్థలు, రాజకీయ నేతల దగ్గర ఎక్కువగా ఆయుధాలు ఉన్నాయి. వాస్తవానికి ఆయుధాల లైసెన్స్ జారీని గతంతో పోలిస్తే చాలావరకు తగ్గించారు.

ఓటర్లను భయపెట్టకుండా..

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఏ ఒక్కరు కూడా ఆయుధాలు కలిగి ఉండకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు ఉన్నాయి. ఓటర్లను భయపెట్టకుండా ఉండేందుకు వీలుగా ఆయుధాలను స్టేషన్లలో డిపాజిట్ చేయిస్తున్నారు. బ్యాంకులు, ఏటీఎంలకు మాత్రం తుపాకుల డిపాజిట్ నుంచి మినహాయింపు ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 1,356 ఆయుధాలను వాటి అనుమతిదారులు డిపాజిట్ చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

మద్యం అక్రమ రవాణాకు సహకరిస్తే ఉపేక్షించం

- వీడియో కాన్ఫరెన్స్‌లో సెబ్ అధికారులకు డీఐజీ హెచ్చరిక

కర్నూలు: మద్యం అక్రమ రవాణాదారులకు కొంతమంది సెబ్ సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, విచారణలో నిజమని తేలితే శాఖాపరమైన చర్యలు తప్పవని కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు హెచ్చరించారు. కర్నూలులోని క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేయడం ద్వారా మద్యం, డబ్బు, కానుకలు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి అయ్యే అవకాశమున్నందున దంపుల పైన దృష్టి సారించి దాడులు చేయాలని ఆదేశించారు. అలాగే నాటుసారా, మద్యం రవాణాపై కూడా నిఘా పెంచాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో రూట్ వాచ్‌లు ముమ్మరం చేయాలన్నారు. చెక్‌పోస్టులలో వసతులను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమకూర్చుకోవాలన్నారు. రేంజ్ పరిధిలోని అడిషనల్ ఎస్పీలు నాగరాజు, రాముడు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్లు రవికుమార్, రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులు నాయుడు, ఏఈఎస్‌లు వినోద్‌కుమార్ నాయక్, రవితో పాటు నాలుగు జిల్లాల సెబ్ సీఐలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సంక్షేమ ఉగాదులు... అభివృద్ధి ఉషస్సులు

- ఐదేళ్లు అర్హులందరికీ అందిన సంక్షేమ పథకాలు
- పల్లెలు, పట్టణాల్లో ప్రగతి పరిమళాలు
- జిల్లాలో తగ్గిన పేదరికం
- పెరిగిన జీవన ప్రమాణాలు
- ప్రభుత్వ చర్యలతో ఇంటింటా పండుగ వాతావరణం

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లా అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించింది. సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే వచ్చాయి. నవరత్నాల పథకాల అమలుతో ప్రతి ఇంటా సం'క్షేమ' కాంతులు వెలుగులీనాయి. నీటి వనరులు అభివృద్ధి చెంది అన్నదాతలు ఆనందంగా 'సాగు'బాట పట్టారు. ఆసరా, చేయూత, సున్నా వడ్డీ.. ఇలా అనేక పథకాలతో మహిళలు స్వయం ఉపాధికి మార్గం వేసుకున్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, వసతి, విద్యా దీవెనలతో విద్యార్థులు ఉన్నత స్థానాలను అందుకుంటున్నారు. ఆరోగ్యశ్రీతో లక్షలాది మంది పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా ఖరీదైన వైద్యం అందింది. ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక హంగులు అద్దుకోగా.. ఊరూరా ప్రభుత్వ భవనాలు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. ప్రగతి 'బాట'ల్లో పల్లెలు, పట్టణాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడి ప్రజలంతా సంతోషంగా ఉన్నారు.


కర్నూలు సిటీ/కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల కష్టాలను చూసి వారిని ఆదుకోవడానికి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేశారు. ఈ పథకాల ద్వారా 58 నెలల కాలంలో కర్నూలు జిల్లాలో పేదల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.10,136 కోట్లు జమ అయ్యాయి. పిల్లలను స్కూళ్లకు పంపితే చాలు అమ్మ ఒడి పథకం ఏడాదికి రూ.15 వేలు ఇస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో జిల్లాలో పేదరికం గణీయంగా తగ్గింది. టీడీపీ హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 19.64 శాతం పేదరికం ఉండగా..నేడు 12.84 శాతానికి తగ్గిపోయింది. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ నివేదించింది. సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలు కావడంతో ప్రజలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు. జిల్లాలో ఒక్కో కుటుంబానికి రెండు నుంచి 5 ప్రయోజనాలు చేకూరాయి. ఒక్కో కుటుంబానికి సగటున రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరింది. గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు కావడంతో ప్రజా సమస్యలకు వెంటనే పరిష్కారం లభిస్తోంది. 2022 జనవరి 1 నుంచి ఏపీ సేవా పోర్టల్ అమల్లోకి రాగా నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 42.67 లక్షల అర్జీలు పరిష్కారమయ్యాయి.

ఇదీ అభివృద్ధి..

- నాడు – నేడు కింద రూ.500 కోట్లతో కర్నూలు మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆధునికీకరించారు.
- రూ.120 కోట్లతో హాస్పిటల్ ఆవరణంలో కొత్తగా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను నిర్మించి ప్రారంభించారు.
- రూ.500 కోట్లతో ఆదోనిలో కొత్తగా మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- జిల్లాలోని రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రూ.1,899 కోట్లతో 334 రోడ్లు (కొత్త రోడ్లు) అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో ఇప్పటి వరకు రూ.600 కోట్లతో 199 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- దశాబ్దాలుగా ఆదరణకు నోచుకోని పల్లె రోడ్లు నేడు అభివృద్ధి చెందుతున్నాయి. రూ.189.29 కోట్లతో 39 పనులు జరుగుతున్నాయి.
- జిల్లాలో గ్రామ సచివాలయాలకు 242 భవనాలు నిర్మించారు. అలాగే 206 రైతు భరోసా కేంద్రాలు, 135 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, 12 అర్బన్ హెల్త్ సెంటర్లకు నూతన భవనాలు సమకూరాయి. ఇందుకు రూ. 270 కోట్లు ఖర్చు చేశారు.
- మనబడి నాడు–నేడులో భాగంగా మొదటి విడతలో 594 ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. రెండో విడతలో 1,051 స్కూల్స్, 23 జూనియర్ కాలేజీల్లో పనులు చేపట్టారు.
- ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యాబోధనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లాలో 2022–23 లో 32,011, 2023–24 సంవత్సరానికి 29,393 ట్యాబ్‌లు ఇచ్చారు. 1నుంచి 10వ తరగతి విద్యార్థుల తరగతి గదుల్లో 6,485 ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు.



కర్నూలు నగరంలో అర్బన్ హెల్త్ సెంటర్



ప్రభుత్వ పాఠశాలలో ఐఫ్ ప్యానల్ ద్వారా విద్యాబోధన

జల వనరుల శాఖలో ప్రగతి ఇదీ..

- హంద్రీ–నీవా నీటితో 77 చెరువులకు నీరు ఇచ్చేందుకు రూ.253.72 కోట్లతో చేపట్టిన పనులు గతేడాది సెప్టెంబరు నెలలోనే పూర్తయ్యాయి.
- రూ.12.37కోట్లతో పత్తికొండలోని 12, డోన్‌లో 12 చెరువుల సామర్థ్యం పెంచారు.
- గాజులదిన్నె ప్రాజెక్టుకు ఏటా 3 టీఎంసీల నీటిని మళ్లించేందుకు రూ.5.90 కోట్లతో స్లూయిజ్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 4.5 టీఎంసీల నుంచి 5.5 టీఎంసీలకు పెంచేందుకు రూ.57.35 కోట్లతో పనులు చేస్తున్నారు.
- తుంగభద్ర దిగువ కాలువకు 0 నుంచి115 కి.మీ వరకు రూ.520 కోట్లు, 115 కి.మీ నుంచి 205 వరకు రూ.410 కోట్లతో పనులు చేపట్టారు.
- ఎల్‌ఎల్‌సీ 121 కి.మీ దగ్గర గతేడాది హగేరి నదిపై నిర్మించిన అక్విడక్ట్ పిల్లర్ వరద నీటికి కొట్టుకుపోవడంతో రూ.50 కోట్లతో శాశ్వత పనులు చేపట్టారు.
- రూ.37 కోట్లతో నగరడోణ రిజర్వాయర్ పనులు చేపట్టారు.
- వేదావతి ఎత్తిపోతల పథకాన్ని రూ.1,985 కోట్లతో చేపట్టి రూ. 150 కోట్ల పనులు పూర్తి చేశారు. భూసేకరణ కాకుండా టీడీపీ నేతలు రైతులను రెచ్చగొట్టి అడ్డుకున్నారు.
- ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మించేందుకు రూ.1,945 కోట్లతో పనులు చేపట్టగా, కేఆర్‌ఎంబీకి తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయి.

2019 నుంచి 2024 వరకు జిల్లా ప్రజలకు డీబీటీ ద్వారా అందిన ఆర్థిక ప్రయోజనం

సంక్షేమ పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందించిన మొత్తం రూ.కోట్లలో
వైఎస్ఆర్ ఆసరా	1,73,227	2,924
జగనన్న అమ్మ ఒడి	10,33,191	1,549
జగనన్న చేదోడు	49,814	49.81
ఉచిత పంటల బీమా	3,25,730	618.97
వైఎస్ఆర్ ఈబీసీనేస్తం	13,245	19.86
వైఎస్ఆర్ ఇన్‌పుట్ సబ్సిడీ	18,241	17.80
జగనన్నతోడు	72,524	1,105
జగనన్న వసతి దీవెన	1,71,671	157.13
జగనన్న విద్యా దీవెన	1,76,083	310.68
వైఎస్ఆర్ కాపునేస్తం	5,337	8.00
వైఎస్ఆర్ నేతన్న నేస్తం	3,263	30.11
వైఎస్ఆర్ రైతు భరోసా	2,96,739	1793.53
వైఎస్ఆర్ సున్నా వడ్డీ (పంట రుణాలు)	30,671	140.37
వైఎస్ఆర్ వాహన మిత్ర	60,506	60.50
వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ	1,91,964	403.50
వైఎస్ఆర్ చేయూత	1,24,045	666.50
వైఎస్ఆర్ పెన్షన్ కానుక	2,45,320	3740.90
వైఎస్ఆర్‌బీమా	3,286	26.40
	29,949,917	10,026.85

నేడు ఉగాది

కర్నూలు కల్చరల్: క్రోధి నామ తెలుగు సంవత్సరాది ఉగాది మంగళవారం ప్రారంభం కానుంది. జిల్లాలో ఈ పండుగను వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు జరగనున్నాయి. ఆస్పరి మండలం కైరుప్పలలో ఉగాది వేడుకల్లో భాగంగా పిడకల సమరం నిర్వహించి వీరభద్ర స్వామికి, కాళికా దేవికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. కల్లూరులో చౌడేశ్వరిదేవి ఆలయంలో బురదలో గార్దభాలతో, ఎద్దులతో ప్రదర్శన జరపనున్నారు. మత సామరస్యాన్ని చాటుతూ కొత్తళం దర్గాలో పంచాంగ పఠనం చేయనున్నారు.

అవినీతికి తావు లేదు



ఐదేళ్ల అద్భుతమైన సంక్షేమ పాలన సాగింది. రాజకీయ నాయకులు సిఫారసులు, దళారుల ప్రమేయం, అవినీతికి తావు లేకుండా.. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు అయ్యాయి. అభివృద్ధి పనులు కూడా జోరుగా సాగాయి. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామస్థాయిలోనే అందుతున్నాయి. ఐదేళ్ల సంక్షేమ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారు.
– బొమ్మన రవిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, వెల్దుర్తి

చంద్రబాబును నమ్మేది లేదు



రుణమాఫీ చేస్తానంటూ 2014లో చంద్రబాబు రైతులను నట్టేట ముంచారు. ఆయన చెప్పింది ఏ ఒక్కటీ చేయలేదు. మళ్లీ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టడానికి వస్తున్నారు. చంద్రబాబును ఎట్టి పరిస్థితుల్లో నమ్మేది లేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో చెప్పింది చెప్పినట్లు అమలు చేశారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉంది.
– ఆర్.లక్ష్మీకాంతరెడ్డి, రైతు, చించు ఎర్రగుడి, కృష్ణగిరి మండలం



అశేష భక్తజనం మధ్య ప్రభోత్సవ దృశ్యం

కనుల పండువగా ప్రభోత్సవం

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీశైలంలో ప్రభోత్సవం నేత్రానందభరితంగా సాగింది. ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను నంది వాహనంపై అలంకరించారు. ప్రత్యేక అలంకీకృతులైన మహాసరస్వతి అమ్మవారికి, నందివాహనాధీశులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు, పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులను గంగాధర మండపం వద్ద ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన ప్రభపై ఉంచి అర్చకులు ప్రత్యేక పూజాహారతులు ఇచ్చారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు ప్రభోత్సవం కనుల పండువగా సాగింది. అమావాస్య ఘడియలను పురస్కరించుకుని అగ్నిగుండప్రవేశం, వీరాచార విన్యాసాలు కొనసాగాయి. ఉగాది మహోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు మంగళవారం పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం రథోత్సవం ఉంటుంది.

ప్రాణం పోయేంత వరకు వైఎస్సార్‌సీపీని వీడను

- ఎల్లో మీడియా పుకార్లను నమ్మవద్దు
- కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తా
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో బీవై రామయ్య, ఇంతియాజ్ తదితరులు

కర్నూలు (టౌన్): ప్రాణం పోయేంత వరకు వైఎస్సార్‌సీపీని వీడేది లేదని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గెలిచే దమ్ములేక టీడీపీ నాయకులు, టీజీ కుటుంబం కుయుక్తులకు పాల్పడుతోందన్నారు. తాను పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని ఆశించానని, రానందున అసంతృప్తి ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికే తాను ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేశానని గుర్తు చేశారు. ఎస్వీ కుటుంబానికి రాజకీయంగా ఎంతో చరిత్ర ఉందని, పదవులను అడగాల్సిన అవసరం లేదన్నారు. పదవులే తమ వద్దకు వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే రెండు సార్లు కర్నూలులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలిచారని, మూడో సారి ఇంతియాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. పత్తికొండ, ఆలూరు, నంద్యాలలోనూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు.

- కర్నూలు పార్లమెంటు అభ్యర్థి బీవై రామయ్య మాట్లాడుతూ.. ఏనాడు ప్రజల్లో తిరగని టీజీ భరత్ వైఎస్ఆర్‌సీపీ గురించి మాట్లాడుతుంటే వింతగా ఉందన్నారు. కర్నూలు ప్రజలకు టీజీ కుటుంబం చేసిందేమీ లేదన్నారు. మూడో సారి ఓడిపోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సిద్ధం సభలతోనే తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందన్నారు. ఒకటో తేదీ పెన్షన్ రాకుండా, ఇంగ్లిషు విద్య అమలు చేయకుండా, న్యాయరాజధాని రానీయకుండా, ఇంటి పట్టాలు ఇవ్వకుండా అడ్డుకున్న చంద్రబాబుకు ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు.
- ఈనెల 12 నుంచి కర్నూలు నియోజకవర్గంలో ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమం చేపడుతున్నట్లు కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ తెలిపారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తామన్నారు. జగనన్న పాలన నచ్చే ఐఏఎస్ పదవికి రాజీనామా చేసి పార్టీలో చేరినట్లు చెప్పారు. కర్నూలు నగరంలో పార్టీ చాలా బలంగా ఉందన్నారు. తనకు కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ల మద్దతు ఉందన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు సీహెచ్ మద్దయ్య, కార్పొరేటర్ క్రాంతికుమార్, షరీఫ్, కిషన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమజంట బలవన్మరణం

- రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ప్రేమికులు
- మంత్రాలయంలో విషాదం

మంత్రాలయం/ఆదోని సెంట్రల్: తమ ప్రేమకు పెద్దలు అడ్డుచెబుతారని అనుకున్నారో ఏమో.. ఓ యువతి, యువకుడు రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నారు. రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపిన వివరాల మేరకు... మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చాకలి చిన్న గోవిందు మొదటి భార్య ఏకైక కుమారుడు వెంకటేష్ (20), మంత్రాలయం మండల కేంద్రానికి చెందిన నందిని(19) అనే యువతి రచ్చుమర్రి ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ప్రస్తుతం యువతి కర్నూలులో బీటెక్ చదువుతోంది. ఇంటర్ పూర్తిచేసుకున్న యువకుడు వచ్చే ఏడాది బీటెక్ చదవాలని భావించాడు. చదువుకున్న రోజుల్లో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇష్టపడిన యువకుడు, యువతీ ఏమి ఆలోచన చేశారేమోగాని ఆదివారం అర్ధరాత్రి ఇంటి నుంచి పారిపోయారు. తుంగభద్ర రైల్వే స్టేషన్‌కు చేరుకుని సమీపంలోని బ్రిడ్జి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాలను గుర్తించిన గ్యాంగ్‌మ్యాన్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ గోపాల్ సంఘటన స్థలం చేరుకున్నారు. మృతదేహాలను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆదివారం వరకు తమతో ఉన్న వారు సోమవారం ఉదయం శవాలుగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


వెంకటేష్, నందిని (ఫైల్)

యువకుడి దారుణహత్య


మృతిచెందిన సమీర్ (ఫైల్)

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఓ యువకుడిని గుర్తుతెలియని దుండగులు దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. దేవనగర్ వీధికి చెందిన చోట ఇద్రూస్‌వలి, గౌసియాలు దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సమీర్ (22) డోర్ పాలిష్ పని చేస్తూ సాయంత్రం చికెన్ పకోడి వ్యాపారం చేస్తున్నాడు. రంజాన్ మాసం కావడంతో సమీర్ ఇంటిపై ఒక్కడే పడుకుని తెల్లవారుజామున మసీదులో ప్రార్థనకు వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి యథావిధిగా చికెన్ పకోడి వ్యాపారం ముగించుకుని ఇంటి పైకి వెళ్లి నిద్రపోయాడు. సోమవారం ఉదయం సమీర్ తల్లి ఇంటి పైకి వెళ్లి చూడగా కుమారుడు రక్తపుమడుగులో విగత జీవిగా పడి ఉన్నాడు. గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా గొంతు భాగంలో పదునైన ఆయుధంతో నరికి హత్య చేసినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతుడి తండ్రి ఇద్రూస్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హత్యకు గల కారణాలు, నిందితుల వివరాల కోసం విచారణ చేపట్టారు.

ఇనుప ఖనిజం అక్రమ తవ్వకం

కర్నూలు (న్యూటౌన్): వెల్దుర్తి మండలం సర్పరాజపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 501, 448లో ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తవ్వి పెద్ద ఎత్తున నిల్వ చేసినట్లు తనిఖీల్లో వెల్లడైందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి. రాజశేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. వెల్దుర్తి మండలం బాలాపురం - రేపల్లె గ్రామా ల మధ్యలో అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తవ్వి తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా మైనింగ్ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, పోలీసులు, గ్రామ రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేశారన్నారు. అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తవ్వి తరలించి పెద్ద ఎత్తున నిల్వ ఉంచారని విచారణలో తేల్చారన్నారు. సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై కేసు నమోదు చేస్తామన్నారు.

రింగుల బాషా కోసం వేట

కర్నూలు: మద్యం రవాణా 'రింగ్' మాస్టర్ చింపర్తి రింగుల బాషా కోసం వేట మొదలైంది. కర్నూలు శివారులోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ అధికారుల తనిఖీల్లో రూ.14.51 లక్షల విలువ చేసే 240 బాక్సుల మద్యం పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా అనుమానిస్తున్న చింపర్తి రింగుల బాషా కోసం కర్నూలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు వేట ముమ్మరం చేశారు. ఇందుకోసం ఎస్‌ఐ నేతృత్వంలో ఐదుగురితో కూడిన ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. ఈ కేసులో వాహన డ్రైవర్ పఠాన్ సాదిక్, క్లీనర్ షేక్ షఫీలపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పడంతో జిల్లా జైలులో అప్పగించారు. మద్యం రవాణా ప్రధాన సూత్రధారి ఎ-3 నిందితుడుగా ఉన్న చింపర్తి రింగుల బాషా స్వగ్రామం కడప జిల్లా చాపాడు మండలం పల్లెవోలుకు చెందిన ఖాదర్‌పల్లె. రెండు రోజులుగా రింగుల బాషా ఫోన్ కూడా స్విచాఫ్ వస్తుండటంతో నేరుగా అధికారులే రంగంలోకి దిగి అతని కోసం గాలిస్తున్నారు. అలాగే వాహన యజమాని హబీబుల్లా కోసం కూడా వేట మొదలైంది.

సాంకేతిక ఆధారాలు సేకరించిన ఇంటెలిజెన్స్ టీమ్

సార్వత్రిక ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో భారీ మొత్తంలో మద్యం పట్టుబడటంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో పాటు సెబ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధాన నిందితుడు చింపర్తి రింగుల బాషాపై గతంలో ఎర్ర చందనం, మద్యం అక్రమ రవాణాకు సంబంధించి 104 కేసులు ఉన్నాయి. ఆయా కేసుల్లో ఎన్నిసార్లు అరెస్టు అయ్యాడు? కేసులు ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే అందుకు కారణాలు తదితర అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. కొన్ని కేసుల్లో అరెస్టు చేయకపోవడానికి కారణాలపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామంలోని శ్రీనివాస వైన్స్ పేరుతో బిల్లులు వేయించుకుని వనపర్తి ఐఎంఎల్ డిపోలో మద్యం లోడ్ చేసుకుని మైదుకూరు, ప్రొద్దుటూరుకు తరలిస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఈనేపథ్యంలో రింగుల బాషాకు శ్రీనివాస వైన్స్ నిర్వాహకులతో ఎంతకాలం నుంచి వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి అనే కోణంలో కూడా విచారణ సాగుతోంది.

రింగుల బాషా కారులో కర్నూలుకు వచ్చినట్లు ఆధారాలు

వోక్స్ వ్యాగన్‌కు చెందిన కారులో రింగుల బాషా కర్నూలుకు వచ్చి సంతోష్ నగర్‌లో ఉండి మద్యం వాహనాన్ని జిల్లా సరిహద్దు దాటించేందుకు ప్రయత్నించినట్లు సెబ్ ఇంటెలిజెన్స్ టీమ్ ప్రాథమిక సాక్ష్యాధారాలను సేకరించారు. ఒప్పందం ప్రకారం డ్రైవర్ పఠాన్ సాదిక్, క్లీనర్ షేక్ షఫీ కడప నుంచి బస్సులో వచ్చి పంచలింగాల టోల్‌ప్లాజా దగ్గర ఉండగా మద్యం లోడు లారీని వారికి అక్కడ అప్పగించి రింగుల బాషా కర్నూలు చేరుకున్నట్లు ఆధారాలు సేకరించారు. అయితే స్మార్ట్ ఫోన్‌కు బదులుగా కీప్యాడ్ ఫోన్ వాడినందున టవర్ లొకేషన్ ఆధారంగా అతనితో ఎవరెవరు ఉన్నారనే ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం. రింగుల బాషాతో పాటు వాహన యజమాని హబీబుల్లా, డ్రైవర్ పఠాన్ సాదిక్, క్లీనర్ షేక్ షఫీల ఫోన్‌లకు ఎవరెవరు మాట్లాడారు? ఈ ముఠా వెనుక ఇంకెవరైనా ఉన్నారా? తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. ఈ కేసులో ఉన్న నలుగురు నిందితుల్లో ఫోన్‌పే యాప్ ఎవరెవరికి ఉంది? వారి ద్వారా ఎంత మొత్తంలో నగదు బదిలీ అయింది? ఎవరెవరికి బదిలీ చేశారు? అందులో వ్యాపార లావాదేవీలు ఏమైనా ఉన్నాయా? తదితర అంశాలపై కూడా పోలీసు, సెబ్ అధికారులు సాంకేతికత ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

అనుమానాస్పద లావాదేవీలపై నిఘా

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): అనుమానాస్పద, లక్షకుపైగా జరిగిన లావాదేవీలపై నిఘా ఉంచి.. వివరాలను తనకు ప్రతి రోజూ నివేదించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులోవ్యయ పర్యవేక్షణ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని నియంత్రించేందుకు బ్యాంకుల లావాదేవీల వివరాలను తమకు తెలపాలన్నారు. జిల్లాలో కేవలం తొమ్మిది బ్యాంకులు మాత్రమే లావాదేవీల వివరాలను తెలుపుతున్నాయని, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా,కెనరా బ్యాంకు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులు స్పందించడంలేదన్నారు. నివేదికలు రాకపోతే సంబంధిత బ్యాంకులకు నోటీసులు జారీ చేస్తామని, బ్యాంకు నోడల్ అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లావాదేవీలు లేవని నివేదికల్లో చూపించి.. పట్టుబడిన నగదు అదే బ్యాంకు నుంచి వచ్చినట్లు తేలితే బ్రాంచ్ మేనేజర్‌ను సస్పెండ్ చేస్తామన్నారు. నోడల్ అధికారులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎల్‌డీఎం రామచంద్రావు, డీసీఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, మెప్మా పీడీ నాగ శివలీల, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ పాండురంగ పాల్గొన్నారు.

దివ్యాంగులకు పూర్తి స్థాయిలో ఓటు హక్కు

కర్నూలు(అర్బన్): సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులకు పూర్తి స్థాయిలో ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆమె సమావేశం నిర్వహించారు. మే 13వ తేదీన ప్రతి ఒక్కరితో పాటు దివ్యాంగులు కూడా సులభంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్లు , ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇద్దరు సహాయకులను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కంటి చూపు లోపం ఉన్న వారికి బ్రెయిలీ లిపిలో ఏర్పాటు చేశామన్నారు. ట్రాన్స్‌జెండర్స్ ఓటర్ల పట్ల ఎలాంటి వివక్ష చూపకుండా వారు ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే 85 సంవత్సరాల వయస్సు పైబడిన, అనారోగ్య కారణాల వల్ల ఇంటి నుంచి బయటకు రాలేని వారికి మాత్రమే హోం ఓటింగ్ కల్పిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రణాళిక శాఖ సంచాలకులు భారతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి, డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఎస్‌ఏ పీఓ విజయజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ చేసుకున్న తుపాకులను ఇప్పించండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పోలీసులు డిపాజిట్ చేసుకున్న మాజీ సైనికుల తుపాకులను తిరిగి ఇప్పించాలని జాతీయ మాజీ సైనికుల సమన్వయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పీ శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ఫోర్సుల్లో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన అనేక మంది మాజీ సైనికులు , బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్ మాజీ జవాన్లు తమ తమ బతుకుదెరువు కోసం తుపాకులు తెచ్చుకొని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారన్నారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసు అధికారులు వారి తుపాకులను డిపాజిట్ చేసుకున్నారన్నారు. తుపాకులు వారి వద్ద లేకపోవడం వల్ల వారు ఉపాధి కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ... వివిధ బ్యాంకుల్లో విధులు నిర్వహిస్తున్న మాజీ సైనికుల తుపాకులను తిరిగి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 27వ తేదీన జీఓ ఆర్‌టీ నెంబర్: 422 జారీ చేసిందన్నారు. అయితే పోలీసులు మాత్రం తమ వద్ద డిపాజిట్ చేసుకున్న మాజీ సైనికుల తుపాకులను అందించడం లేదన్నారు. ఇదే విషయా న్ని ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన దృష్టికి కూడా తీసుకుపోయామన్నా రు.వెంటనే మాజీ సైనికుల తుపాకులను వాపసు చేసే విధంగా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

బ్లేడ్‌తో చేయి కోసుకున్న యువతి

ఆదోని అర్బన్: ప్రియుడు పెళ్లికి నిరాకరించడతో ఓ యువతి బ్లేడ్‌తో చేయికోసుకుంది. టూటౌన్ సీఐ గోపి తెలిపిన మేరకు వివరాలు.. ఆదోని పట్టణం బండిమెట్ట కాలనీకి చెందిన గోవింద్, అదే కాలనీకి చెందిన ఓ యువతి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోను అన్నందుకు యువతి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చింది. బ్లేడుతో చిన్నగా చేయిని కోసుకుందని సీఐ తెలిపారు. ఆమెను వెంటనే తమ సిబ్బందితో ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించామన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పెళ్లి కోసం డ్రా చేసిన డబ్బు అపహరణ

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన బోయ కాశన్న తన కుమార్తె వివాహం కోసం దాచుకున్న రూ.3.20 లక్షలు నగదును గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అపహరించాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి రూ.3.20లక్షల నగదు డ్రా చేసుకుని రోడ్డుపై వెళ్తుండగా వెనుకల నుంచి ఓవ్యక్తి స్ప్రే చల్లాడు. దీంతో కళ్లు, శరీరం మంటగా అనిపించడంతో తుడుచుకుంటుండగా నగదు సంచి లాక్కుని వెళ్లాడు. గట్టిగా కేకలు వేయడంతో వెంటనే అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి పిర్యాదు మేరకు సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డికి తెలియజేశారు. సోమవారం విజయవాడ నుంచి సీఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. కర్నూలు అర్బన్ ఎస్‌ఎస్ ట్యాంకు, గాజులదిన్నెలలో సరిపడా తాగునీరు ఉన్నాయన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు మండలాలకు ఒక ప్రత్యేకాధికారిని నియమించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ ఎస్‌ఈ ఉమాపతి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.